


# మహా రుద్రాభిషేకం

స్నానమాడు తండ్రీ!

కన్నీళ్ళ కాగావు, కష్టాల్లో వేగావు. ఎండల్లో మండావు. వొళ్ళు ఉడికి పోయింది. కళ్ళు కవిలి పోయాయి. సంతత ధారగా తలారా నీళ్ళోసుకుని చల్లబడు తండ్రీ! చల్లబడి, ముందుకు చూడు నా తండ్రీ!

హరహర మహాదేవ !

నరహర మహాదేవ!

అల్ల! ఆ నల్లకొండల్లోంచి పరుగు పరుగున వచ్చిందయ్యా కృష్ణమ్మా!

నెమలిపింఛపు చాయ చీర చుట్టాబెట్టి

పాల కొంగల చాయ పట్టు రైకా కట్టి

లోయలో జాలుగా బారు జడ వేసికొని

కొండ పుప్పొడి తేనె వొడిలోన వొంపుకొని

కోనపక్షుల రవము కొంగులో కప్పుకుని

వాగుల్ల వంకల్ల రాసుకుంటూ, దూసుకుంటూ

గట్టు పుట్టలమీంచి గబగబా దూకుతూ

అందెల్లు ఘల్లుమన

మట్టెల్లు ఝల్లుమన

ఝణఝణా

ఫెళా ఫెళా

గల గలా

సరసరా

ఉరకలతో పరుగులతో తరలి వచ్చిందయ్యా కృష్ణమ్మ.

ఆ వొడ్డు ఈ వొడ్డు అంతనీ తాకుతూ

అమ్మ తల్లిలా,

అలల చేతులు అన్ని వైపులా విప్పుతూ పిలుస్తోందయ్యా కృష్ణమ్మ!

స్నానమాడు తండ్రీ!

శాంతించు తండ్రీ!

ఓ హరుడా!

ఓ నరుడా!

అన్ని పుణ్య నదులకు ఆత్మలా వచ్చిందయ్యా వాహిని.

రాత్రి ఏమి నిద్రపోయావో! ఏ చెడ్డకల వచ్చిందో ! గతమెంత జీర్ణమయిందో!

లే తండ్రీ! లే ! లేచి స్నానమాడు.

కాళ్ళు కడుక్కునే నీళ్ళు, దాహమాపే నీళ్ళు, వొళ్ళు నిమిరే నీళ్ళు, చల్లబరిచేనీళ్ళు

దోసిళ్ళ పట్టి అక్షయంగా తెచ్చానయ్యా! లే!

అప్పుడే కృష్ణవొడ్డున ఆడంగులు స్నానాలు చేస్తున్నారు. మొగవాళ్ళు లోతుకి వెళ్ళి ఈతలు కొడ్తున్నారు. పిల్లలు కోసురాళ్ళ మీంచి ఎగిరెగిరి దూకుతున్నారు. కొత్తగా కాపురాని కొచ్చిన వైదేహి ఇంకా రాలేదు. 'అత్తగారు కృష్ణకొచ్చి అరగంట దాటిందే! వైదేహి ఇంకా రాలేదేమా!' అని ఎదురుచూస్తున్న రాధకి గబగబా తొట్రుపడుతూ వస్తున్న వైదేహి కన్పించింది. వైదేహి సరాసరి నిలువు లోతులో స్నానం చేస్తూన్న రాధ దగ్గరకెళ్ళింది.

"ఇంతాలస్యం ఆయిందేం?" అంది రాధ.

"ఇంటిపని" అంది వైదేహి.

రాధ సూటిగా వైదేహి ముఖంలోకి చూసింది. అమ్మదొంగ! దొరికిపోయింది.

"మీఅత్తగారు బయటకొచ్చాక మీ ఆయన ఇప్పటిదాకా ఉండి ఇప్పుడే కదూ

పొలం వెళ్ళాడు'' అంది రాధ.

వైదేహి తెల్లబోయి సిగ్గుతో ముకుళించుకుపోయింది.

"కొత్త పెళ్ళికూతురివి సరేగాని నీ ముఖం మీద తోకచుక్కలా చెరిగిపోయిన బొట్టు అసలు కథంతా చెప్పేస్తోంది'' అంది రాధ.

సిగ్గు పట్టలేక బుడుంగున నీళ్ళలో మునిగింది రాధ. నీళ్ళ అడుగున ఎంత సిగ్గుతో ముడుచుకుపోయిందో, ఎంత ముసి ముసి నవ్వులు నవ్వుకుందో ఆ కృష్ణమ్మకే తెలియాలి.

వందలమంది ముత్తయిదువలు, మొగవాళ్ళు స్నానాలుచేసి శుభ్రగాత్రులయి ఎవరి పనులకు వాళ్ళు వెళుతున్నారు. నువ్వూ తనివితీరా తలారా స్నానం చెయ్యి తండ్రీ! చేయవలసిన పని చేతులనిండా ఉంది.

పరుచుకుంటున్న సూర్యకిరణాల్లా లోకంలో నవ్వులు విన్పిస్తున్నాయి. పొద్దున్నే ఇసకలో ఆడుకుంటున్న పిల్లలు, ఇసక చిట్టి గుప్పిట్లతో పట్టి ఒకరిమీద ఒకరు విసురుకుంటూ కిల కిలా నవ్వుతున్నారు. ఇసకలో ఒకర్నొకరు కింద పడవేసుకుంటూ ప్రపంచాన్ని జయించిన వీరుల్లా పొంగి పొంగి నవ్వుతున్నారు. వాళ్ళని చూసి అప్పుడే విచ్చిన పువ్వులు నవ్వుతున్నాయి. ఆ పక్క శ్రీదేవి తులసికోట దగ్గర కూర్చుని తనలో తనే మురిసిపోయి నవ్వుకుంటోంది. కాపురాని కొచ్చి పదేళ్ళయినా కడుపు పండలేదు. అత్తమామల సాధింపులయ్యాయి. ఆడబిడ్డల ఈసడింపు లయ్యాయి - నిన్ననే .... నిన్ననే తెలిసింది తను తల్లి కాబోతున్నట్లు. అత్త మెచ్చుకుంది. ఆడబిడ్డ అలంకారాలు చేసింది. ఇక భర్త సరేసరి. శ్రీదేవి కడుపు నిమురుకుంటూ, పుట్టబోయే బిడ్డని తలచుకుంటూ ముసి ముసిగా తృప్తిగా నవ్వుకుంది. తులసిదళాలు గాలికి వూగిపోయాయి.

అన్నదమ్ములూ, తోడికోడళ్లూ పెద్దపండగ జరుపుకొంటున్నట్లు ఆ వరండాలో ఒకటేనవ్వులు. ఆ రెండు కుటుంబాలు విడిపోయి పదేళ్ళయింది. వాళ్ళ మధ్య మాటల్లేవు. పిలుపు లంతకన్నా లేవు. ఒకే రక్తం పంచుకున్న వాళ్ళు బద్ధశత్రువులయిపోయారు. అన్న ఇంట్లో శుభకార్యం పదేళ్ళ ఇనుప తెరని ముక్కలు ముక్కలు చేసింది.

'వాడు పిలిస్తే వస్తా' నన్నాడు తమ్ముడు.

'దానికేం పిలుస్తా' నన్నాడు అన్న. పిలిచాడు. వచ్చాడు. కలిసిపోయారు. పదేళ్ళ కబుర్లన్నీ ఒక్క రోజులోనే చెప్పుకోవాలని కాబోలు ఒకటే మాటలు. వాళ్ళ అయ్యకాలం జ్ఞాపకం తెచ్చుకున్నారు. కలసిమెలసి ఒకళ్ళ ముద్ద ఒకళ్ళు అందుకున్నట్టు వరస నవ్వులు.

దీపావళి పండుగనాడు రాముడు తారాజువ్వలు కాలుస్తుంటే విశాలమైన ఛాతీవైపు, పొడవాటి చేతులవైపు ఆశగా తలుపు చాటునించి చూస్తున్నది ప్రమీల. అలా చూస్తున్న ప్రమీలని తనూ చూడాలని ఉన్నట్టుండి చిచ్చుబుడ్డి వెలిగిస్తే ఆ వెలుగులో తనకోసం వెలిగించిన దీపకాంతిలో పట్టుచీర కొంగుచాటు నించి ప్రమీల నవ్విన నవ్వు .... ఆ నవ్వు కోసమేగా రాముడు మర్నాడే పెళ్ళి ముహూర్తం నిశ్చయించమని తొందరబెట్టింది.

లక్ష్మి సంక్రాంతికి గొబ్బెమ్మలుపెడ్తూ పాట ఆఖరి చరణం "మొగలీపూవంటి మొగుణ్ణివ్వావే" అనంగానే చెలులు చెప్పకుండా వాళ్ళ బావని తీసుకొచ్చి అక్కడ నుంచో పెడితే లక్ష్మి పళ్ళెం అక్కడే వొదిలేసి, చెంగున గెంతటమూ, తీసిన పరుగూ చూడవలసిందే. ఇంట్లో కెళ్ళి ఆయాసంతో చెయ్యి గుండెమీద వేసుకుని సిగ్గుతో నవ్వుకున్న ఆ నవ్వో!

ఆ నవ్వులన్నీ కోసుకొచ్చానయ్యా!
ఇటు నవ్వులు. అటు కన్నీళ్ళు!

సంతలో గొడ్లమ్మబోయిన కొడుకు రౌడీ తగాదాల్లో ఇరుక్కోగా డబ్బు దోచుకుని కొడుకుని హతమార్చి కాలవలో పారేశారని విన్న క్షణం నించి సూరమ్మ కన్నీటికి అర్థం వున్నదా? ఏ ఓదార్పు ఆ తల్లికి తిరిగి కొడుకునివ్వగలదు?

లంకకు గొడ్లు తోలుకుపోయిన భర్త వరద ముంపుకు బలైపోగా బొట్టు మీద బొట్టు మెత్తుకున్నదేగాని ఆ ఇల్లాలు చూపు లంక మీంచి తిప్పిందా? కళ్ళు ధారలవటం మానాయా?

తాత తండ్రులు కట్టిన ఇల్లు, పెళ్ళి పేరంటాలు జరిగిన ఇల్లు, పాపలుయ్యాల

లూగిన ఇల్లు, అప్పుకింద తాకట్టైపోగా ఇల్లు విడిచిపోతున్న పంతులుగారు ఇంటి బయటకొచ్చి ఒక్కసారి ఇంటివైపు చూసినప్పుడు జారిన అశ్రుకణమో! మళ్ళీ ఆ గడపకి పసుపు రాసుకునే యోగ్యత లేదని పంతులుగారి భార్య గడపకి పసుపురాసి బొట్టుపెట్టి మొక్కుతున్నప్పుడు ఆమె కన్నీటికి చెరిగిన కుంకుమరేఖలో .....

ఏటి కేడాదీ భార్య-పిల్లలతో సహా ఆ పొలంలో పనిచేసి, రక్తం ధారపోసి పంటలు పండిస్తే, ఉన్నట్టుండి ఒక్కరాత్రి పంటంతా తుఫాను మింగేస్తే, గట్టునున్న రైతులం, తల్లీ! ఇదేనా న్యాయం ! పిల్ల పెళ్ళి చేద్దామనుకున్నానే! ఇంటిదానికి కడియాలు కొందామనుకున్నానే! పెళ్ళీలేదు కడియాలు లేవు. ఆఖరికి అన్నంకూడా లేకుండా చేశావా అమ్మా" అంటుంటే

ఆ రైతు కళ్ళంట రాలిన కన్నీళ్ళకు భూమి బద్దలవదో!
ఆ నవ్వుల్ని, ఆ కన్నీళ్ళని కలబోసి తెచ్చాను తండ్రీ!
ఆ నవ్వులు నీవు విన్నవే!
ఆ కన్నీళ్ళు నీవు చూసినవే!

ఆ రెండిటినీ కలిపి నా రెండు చేతులా నీ కర్పిద్దామని వచ్చానయ్యా! తెచ్చానయ్యా నూటొక్క బిందె వాసెనగట్టి! మోసుకుంటూ వచ్చానయ్యా దూర దూరాలనించి! అగాధాలు తవ్వి, అంతరంగాలు తొలిచి ఆకాశగంగని, పాతాళగంగని కలబోసి ఒకే జాలుగా మళ్ళించి స్వచ్ఛంగా నా గుండె పంటగా ప్రవహింప చేశానయ్యా!

లే తండ్రీ! లే!
తలార తనివితీర స్నానమాడు!
స్నానమాడి
శాంతించు నరుడా!
దీవించు హరుడా!
హరహర మహాదేవ!
నరహర మహాదేవ ! *